సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో భక్తుల తాకిడిపై ఆదివారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. సెలవు రోజు అయినా రద్దీ సాధారణంగా ఉంది.



కొబ్బరి బొండాలకు గిరాకీ

ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి బొండాలు తాగుతుండటంతో వీటికి గిరాకీ పెరిగింది. 8లో



పాదయాత్ర భక్తులకు ప్రమాదం

ద్వారకాతిరుమల క్షేత్రానికి కాలినడకన వెళుతున్న భక్తులను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. 8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'గురుకుల' పరీక్షలు



పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న నాగరాణి

ఏలూరు (టూటౌన్) : మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి (2025–26) ఆదివారం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్‌వీ నాగరాణి తెలిపారు. ఏలూరు బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏలూరులో పాఠశాలలో 80 సీట్లకు 147 నుంచి విద్యార్థులు దరఖాస్తు చేయగా 116 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. జిల్లా సమన్వయకర్త, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి ఉన్నారు.

పాలిసెట్‌కు పటిష్ట ఏర్పాట్లు

పెంటపాడు: జిల్లాలోని నాలుగు పట్టణాల్లో ఈనెల 30న జరిగే పాలిసెట్–2025 పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్, తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఫణీంద్రప్రసాద్ ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నరసాపురంలో కేంద్రాలు ఏర్పాటుచేశామని, 7,254 మంది పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే పరీక్షకు గంట ముందు హాజరుకావాలన్నారు. హాల్‌టికెట్ రాని వారు పరీక్షా కేంద్రానికి వెళ్లి పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9121602009, 9490104336 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆప్కాస్ రద్దు యోచన తగదు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగులకు 12వ పీఆర్సీ ప్రకటించాలని, ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకుని, ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరులో జరుగుతున్న శిక్షణ తరగతులకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఏ హామీ అమలు చేయలేదన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొంటున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు బి.బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.జానుబాబు, జంగారెడ్డిగూడెం నగర అధ్యక్షుడు ఆర్.నాగరాజు, నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా జయలక్ష్మి



ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఉంగుటూరుకి చెందిన మంద జయలక్ష్మి నియమితులయ్యారు. ఆమె మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా, జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో ఆమెకు రాష్ట్ర పదవి వరించింది. మండల నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ తనకు రాష్ట్ర పదవి కేటాయించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి నిరంతం కృషి చేస్తానని, మహిళల్లో చైతన్యం తీసుకువస్తానని జయలక్ష్మి అన్నారు.

ఏలూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

ఏలూరు టౌన్ : అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు, ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు, పవర్‌పేట స్టేషన్లలో రైల్వే ఎస్సై పి.సైమన్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఏలూరు స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్స్, వెయిటింగ్ హాల్స్, బుకింగ్ కార్యాలయం, రిజర్వేషన్ కౌంటర్లు, పార్సిల్ కేంద్రాల్లో ముమ్మరంగా సోదాలు చేశారు. ఆర్‌పీఎఫ్, రైల్వే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రైల్వేస్ డీఎస్పీ జి.రత్నరాజు, సీఐ ఎంవీ దుర్గారావు సిబ్బందికి సూచించారు. అనుమానిత వ్యక్తులపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలని ఆదేశించారు.

ఆశల పల్లకీలో కొల్లేరు

- హద్దులను పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రభుత్వమే అఫిడవిట్ వేయాలని కొల్లేరు ప్రజల డిమాండ్
- కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేనా?
- అత్యున్నత న్యాయస్థానం సూచనలను అనుకూలంగా మార్చుకుంటున్న నేతలు
- రెగ్యులేటర్ల నిర్మాణం మాటెత్తని కూటమి ప్రభుత్వం



సాక్షి టాస్క్‌ఫోర్స్: కొల్లేరు అనే ఈ మూడక్షరాల పదం రాష్ట్రంలో మరోమారు చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు చెబుతున్న సూచనలతో రాజకీయ నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటున్నారు. తాజాగా మరోసారి కొల్లేరు సరిహద్దులను పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్ర సాధికారత కమిటీని ఆదేశించింది. కొల్లేరు ఆపరేషన్ ద్వారా అక్రమ చెరువులను ధ్వంసం చేసి 19 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అభయారణ్యం ఆక్రమణల చెరలోనే చిక్కుకుంది. కొల్లేరు కాంటూరు కుదింపు సాధ్యం కాదని అధ్యయన కమిటీలు గతంలోనే నివేదిక ఇచ్చాయి. కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతామంటున్న నేతల వాగ్దానాలు నెరవేరేనా అనే అనుమానాలు కొల్లేరు ప్రజల్లో సర్వత్రా వినిపిస్తున్నాయి.

మరోమారు తెరపైకి..

కొల్లేరు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అంతర్జాతీయ రామ్‌సర్ ఒడంబడిక ప్రకారం 1999 అక్టోబరు 4న అప్పటి చంద్రబాబు ప్రభుత్వం జీఓ 120ను తీసుకొచ్చింది. పూర్వపు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 9 మండలాల్లో + 5 కాంటూరు పరిధి వరకు 77,138 ఎకరాలను అభయారణ్యంగా నిర్ణయించారు. అక్రమ చేపల చెరువుల సంఖ్య అభయారణ్యంలో పెరగడంతో 2006లో కొల్లేరు ఆపరేషన్ ద్వారా వేలాది ఎకరాల్లో అక్రమ చెరువులను ధ్వంసం చేశారు. కొల్లేరు సంరక్షణకు 2006 ఏప్రిల్ 10న సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులను ప్రభుత్వ అధికారులు అమలు చేయలేదని ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని కాకినాడకు చెందిన కె.మృత్యుంజయరావు సుప్రీంకోర్టులో కేసు వేశారు.

ప్రధాని హామీ అమలు చేయాలి

ఎన్నికల ప్రచారంలో భాగంగా 2014లో భీమవరం వచ్చిన ప్రధాని మోదీ కొల్లేరు కాంటూరును కుదిస్తానని హామీ ఇచ్చారు. ఆ సభలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా ఉన్నారు. 2015 జూలైలో అప్పటి కేంద్ర పర్యావరణ మంత్రి ప్రకాష్ జవదేకర్, కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు కొల్లేరుపై సమావేశం నిర్వహించారు. అనంతరం కాంటూరు కుదింపుపై త్రిసభ్య కమిటీని నియమించారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్, రివ్యూ పిటీషన్లు దాఖలు చేసి వాదనలు వినిపించాలని కొల్లేరు ప్రజలు కోరుతున్నారు. కాంటూరు కుదింపు జరగాలంటే జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డు (ఎన్‌టీడబ్ల్యూఎల్) ఆమోదం కోసం రాష్ట్ర బోర్డు తీర్మానం చేయాల్సి ఉంది. అలాగే కొల్లేరు సరస్సులో నిత్యం నీరు నిల్వ ఉండాలంటే రెగ్యులేటర్ల నిర్మాణం జరగాలి. కూటమి ప్రభుత్వం దీనిపై ప్రకటన చేయాలని పలువురు కోరుతున్నారు.

కాంటూరు కుదింపు సాధ్యమయ్యేనా..?

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రపంచం గుర్తించిన ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు. 10వ కాంటూరు పై వరకు కొల్లేరు విస్తరించి ఉన్నప్పటికీ 5వ కాంటూరు వరకు మాత్రమే 77,138 ఎకరాల్లో అభయారణ్యంగా గుర్తించారు. కొల్లేరు అభయారణ్యాన్ని 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదిస్తే 48,777 ఎకరాలు మిగులుతుంది. అభయారణ్యంలో పట్టా భూములు 14,932 ఎకరాలు, సొసైటీ భూములు 5,510 ఎకరాలు ఉన్నాయి. గతంలో నష్టపరిహారం చెల్లించకుండా ధ్వంసం చేశారని కొల్లేరు ప్రజలు వాదన వినిపిస్తున్నారు. కొల్లేరుపై అధ్యయనం చేసిన పలు కమిటీలు కాంటూరు కుదింపు సాధ్యం కాదని నివేదికలు అందించాయి. కూటమి నేతలు మాత్రం కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేసినట్లుగానే ప్రచారం చేస్తున్నారు.

రాజకీయం చేయొద్దు



కొల్లేరు కాంటూరు కుదింపు చేస్తామని రాజకీయ నాయకులు చెబుతున్నారు. ముందుగా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించాలి. కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పి ఏళ్లు గడిచిపోయాయి. అమాయకులైన కొల్లేరు ప్రజలకు వాస్తవ పరిస్థితులు చెప్పాలి. ప్రధాని మోదీ ఇచ్చిన హామీ అమలు చేయడానికి కూటమి నేతలు కృషి చేయాలి.

–బలే గణేష్, శృంగవరప్పాడు, కైకలూరు మండలం

రెగ్యులేటర్లు నిర్మించాలి



కొల్లేరు అభయారణ్యంలో ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో 10వ కాంటూరు వరకు నిబంధనలు విస్తరించాలని చూస్తున్నారు. మరోవైపు కాంటూరు 5 నుంచి 3నకు కుదిస్తానని చెబుతున్నారు. ఇది ఎలా సాధ్యమో అర్థం కావడం లేదు. కొల్లేరులో నీరు లేక ఎడారిగా మారింది. ప్రజల వలసలు తగ్గాలంటే ప్రభుత్వం ముందుగా రెగ్యులేటర్లు నిర్మించాలి.

– ఎల్ఎస్ భాస్కరరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మండవల్లి మండలం

పేదల ఇళ్లు కూల్చడమే అభివృద్ధా?

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పీవీఎల్



కాళ్ల: పేదల ఇళ్లు కూల్చడమే కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధా అని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ సమన్వయకర్త పీవీఎల్ నర్సింహరాజు ప్రశ్నించారు. మండలంలోని పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏర్పడేది ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని వారిని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకే కానీ ఇబ్బందులకు గురిచేసేందుకు కాదన్నారు. ఉండి నియోజకవర్గంలో కొంతకాలంగా ఇళ్లను తొలగిస్తున్నారని, దీంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజంగా ఆక్రమణలో ఉన్న ఇళ్లు ఇబ్బందికరంగా ఉంటే నివాసితులకు సమయం ఇచ్చి, ప్రత్యామ్నాయం చూపించి తొలగించాలి తప్ప దుర్మార్గంగా ఇళ్లను కూలగొట్టడం సరికాదన్నారు. ఇళ్ల తొలగింపుతో రోడ్డున పడి ఇబ్బందులు పడుతున్న బాధితులను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధితులు నానా కష్టాలు పడుతున్నా గ్రామ, మండల స్థాయి, కనీసం జిల్లా అధికారులు కూడా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో గ్రామాలు ఏర్పడ్డాయని, గృహ నిర్మాణాలకు సాయం కూడా చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ సుఖసంతోషాలతో ఉండేవారని గుర్తుచేశారు. అయితే కూటమి పాలనలో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అప్పులపాలవుతున్నారని పీవీఎల్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇళ్ల కూల్చివేతపై నిరసన సెగలు



పాలకోడేరులో సీపీఎం ర్యాలీ



ఉండిలో బైక్ ర్యాలీ

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేతను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీలు నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆరు నెలల నుంచి పేదల ఇళ్ల కూల్చివేత సాగుతోందన్నారు. కాలుష్యం పేరు చెప్పి పేదలపై విధ్వంసం సష్టించడం సబబు కాదన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇల్లు కూల్చివేయడం అన్యాయమన్నారు. జిల్లాలో నీటి కాలుష్యానికి గల కారణాలను ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు పరిశీలించాలన్నారు. నిపుణులతో అధ్యయన కమిటీ వేసి నాలుగు మండలాల్లో అధ్యయనం చేయాలన్నారు. ఏళ్ల తరబడి నివసిస్తున్న పేదలను ఇప్పటికిప్పుడు ఖాళీ చేయమనడం అన్యాయమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రఘురామ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఉండి: పేదల ఇళ్లు జల కాలుష్యానికి కారణం అవుతున్నాయని ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఉండి సెంటర్‌లో గోపాలన్ మాట్లాడుతూ కాలుష్యంపై నిర్ధారణ జరగకుండా సొంత నిర్ణయాలు తీసుకుని బడాబాబులకు మేలు జరిగేలా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పెద్దల బాగు కోసం పేదలపై పగ సాధించడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు ఇప్పుడు పనికిరావని చెప్పడం దారుణంగా ఉందని మండిపడ్డారు. ధనికొండ శ్రీనివాస్, చీర్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనం సమకూరేదెప్పుడో?

- కలెక్టరేట్ ఏర్పడి మూడేళ్లు
- అద్దె భవనంలోనే నిర్వహణ
- సొంత భవన నిర్మాణంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- గత ప్రభుత్వంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు చర్యలు



భీమవరంలో కలెక్టరేట్ భవనం

భీమవరం (ప్రకాశం చౌక్) : నూతన పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌కు సొంత భవనం సమకూర్చడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. జిల్లా ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా అద్దె భవనంలోనే కలెక్టరేట్ సాగుతోంది. సొంత భవనం ఏర్పాటుకు మార్కెట్ యార్డ్ ప్రాంతం అనుకూలంగా ఉన్నా అడుగు ముందుకు వేయడం లేదు. ఇటీవల తణుకు, పెనుగొండలో పర్యటనలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టరేట్ భవనం మాటెత్తలేదు. అలాగే ఉన్నతాధికారులతో కనీసం సమీక్ష కూడా జరపలేదు.

గత ప్రభుత్వంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్విభజనలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాను పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలుగా ఏర్పాటుచేశారు. భీమవరంలో కలెక్టరేట్‌ను అద్దె భవనంలో ఏర్పాటుచేసినా సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. భీమవరం మార్కెట్ యార్డ్‌లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం జీఓ కూడా జారీ చేశారు. దీంతో అప్పటి కలెక్టర్ ప్రశాంతి ఈ దిశగా చర్యలు కూడా తీసుకున్నారు.

ప్రభుత్వం మారడంతో..

మార్కెట్ యార్డ్‌లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ అంశం అటకెక్కింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ అమలును పట్టించుకోలేదు. సొంత భవన నిర్మాణంపైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

మార్కెట్ యార్డ్ అనుకూలం

భీమవరం మార్కెట్ యార్డ్‌లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఏర్పాటు చేయడం అనుకూలంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. దీనిద్వారా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని, ఉండి, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు ప్రాంత ప్రజల రాకపోకలకు వీలుందని చెబుతున్నారు. ధర్నాలు, నిరసనల సమయంలోనూ పట్టణంలో ఇబ్బందులు తలెత్తవని అంటున్నారు. అలాగే ఎక్కువగా రోడ్ల నిర్మాణం అవసరం ఉండదని చెబుతున్నారు.

మార్కెట్ యార్డ్‌లో మేలు



భీమవరం మార్కెట్ యార్డ్‌లో కలెక్టరేట్ ఏర్పాటు చేయడం అన్నింటికీ అనుకూలం. ఇప్పటికే అక్కడ స్థలం ఉండటం వల్ల ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణాలు వేగంగా పూర్తవుతాయి. ప్రజలకు రోడ్డు, రైలు మార్గాలు కూడా ఉండటంతో రాకపోకలు సులభం.

– చిగురుపాటి సందీప్, భీమవరం

ప్రయాణ ఇక్కట్లు లేకుండా..



మార్కెట్ యార్డ్‌లో కలెక్టరేట్‌కు సొంత భవనం ఏర్పాటుతో ప్రయాణ ఇక్కట్లు ఉండవు. ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు నుంచి బస్సులు, ఆటోల ద్వారా సులభంగా చేరుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్‌కు వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు.

– వి.శ్రీను, వీరవాసరం

అటవీ శాఖ నిర్లక్ష్యం.. అన్నదాత ఆక్రోశం

- కొల్లేరులో అక్రమ చెరువుకు గండి
- నీరు ఎగదన్ని సమీపంలోని ఏడు ఎకరాల వరి పంట మునక
- లబోదిబోమంటున్న రైతు



ముంపు బారిన పడిన వరి చేను

నిడమర్రు: అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో కోతకు సిద్ధంగా ఉన్న ఏడెకరాల వరి పంట నీటి పాలైన సంఘటన పెదనింద్రకొలనులో చోటుచేసుకుంది. రైతులు, అధికారుల వివరాల ప్రకారం.. కొల్లేరు అభయారణ్యం పరిధిలో అన్‌సర్వే భూముల్లో అనధికారంగా చేపల చెరువులు సాగు చేస్తున్నారంటూ అటవీ శాఖ అధికారులు శనివారం 17 ఎకరాల చేపల చెరువుకు గండి కొట్టారు. దీంతో చెరువు నీరు పంట కాలువలు, బోదెల్లో నీరు ఎగదన్నడంతో సరిహద్దుల్లోని వరి చేలు ఆదివారం ముంపు బారిన పడ్డాయి. కౌలు రైతు చెన్నుబోయిన వెంకన్నకు చెందిన ఏడెకరాల వరి చేను పూర్తిగా నీటమునిగి సుమారు రూ.8 లక్షలు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పులు చేసి సాగు చేశామని బాధిత రైతు వాపోయాడు.

సమాచారం ఇవ్వకుండా..

కొల్లేరు అభయారణ్యం పరిధిలో అక్రమ చేపల సాగు చేస్తున్న వారికి, అటవీ శాఖ సిబ్బందికి మధ్య ఇటీవల వ్యవహారం చెడింది. దీంతో పట్టుబడికి వచ్చిన చెరువులను గండి కొడతామని క్షేత్రస్థాయి సిబ్బంది ఇబ్బందులు పెడుతూ సొమ్ములు వసూలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో నిడమర్రు కొల్లేరు పాయలో అన్‌సర్వే, జిరాయితీ భూముల లెక్కలు తేల్చాలని రైతులు సర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 29న సర్వేకు సిద్ధమవుతున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అటవీ శాఖ అధికారులు ఓ చెరువుకు గండి కొట్టారు. దీనిపై అటవీ శాఖ డీఎఫ్ఓ డి.విజయను వివరణ కోరగా పూర్తి వివరాలు తెలియదని, తమ సిబ్బందిని విచారణకు ఆదేశించానని, నివేదిక అనంతరం ఉన్నతాధికారులకు తెలుపుతామని సమాధానమిచ్చారు.

పరిహారంపై సందిగ్ధం

గండి విషయంలో తమకు సమాచారం లేదని, ఉంటే పంటను ఒబ్బిడి చేసుకోవాలని రైతును అప్రమత్తం చేసేవారమని మండల వ్యవసాయ అధికారి పి.గీతాదేవి అన్నారు. ఈ–క్రాప్‌లో పంట నమోదు చేశామని, నష్టం విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ముంపు చేనును ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించారు.

మా గోడు వినలేదు



ఒక్క రోజు సమయం ఇవ్వండి కోత యంత్రంతో పంటను ఒబ్బిడి చేసుకుంటామని చెప్పినా అధికారులు వినలేదు. చెరువుకు గండి కొట్టారు. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఎకరాకు 60 బస్తాల వరకూ పండింది. ఆదివారం కోతకు సిద్ధమయ్యాం. అటవీ అధికారుల నిర్లక్ష్యంతో మా కుటుంబం ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది.

–బోరున విలపిస్తున్న చెన్నుబోని వెంకన్న, సుబ్బాయమ్మ దంపతులు

అధికారులను వేడుకున్నా..



మా భూముల లెక్కల తేల్చాలని సర్వేకు నెల రోజుల క్రితమే ఆయకట్టు జిరాయితీ రైతులంతా దరఖాస్తు చేసుకున్నాం. గండి కొట్టడానికి వచ్చిన అధికారులకు సర్వే అనంతరం అన్‌సర్వే, జిరాయితీ విడదీసిన తర్వాత గండి కొట్టాలని వేడుకున్నా అటవీ శాఖ సిబ్బంది వినలేదు.

– వగ్వాల సుబ్బారావు, జిరాయితీ భూమి రైతు, నిడమర్రు

మరోసారి కూటమి మోసం



కొల్లేరును 3వ కాంటూరుకి కుదిస్తామంటూ ఎన్నికల్లో కూటమి నేతలు ప్రచారం చేసుకుని ఓట్లు దండుకున్నారు. ఇప్పుడు అభయారణ్యం పరిధిలో జిరాయితీ పట్టా భూములన్న వారిపైకి అధికారులను పంపి వేధిస్తున్నారు. ఇలా మరోమారు చంద్రబాబు సర్కారు కొల్లేరు రైతులను మోసం చేసింది. కౌలు రైతు వెంకన్నకు నష్టపరిహారం ఇవ్వాలి.

–కోడే కాశి, జెడ్పీటీసీ, నిడమర్రు

నేడు కోకో రైతుల 'చలో గుంటూరు'

పెదవేగి: అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటించాలని కోరుతూ సోమవారం చలో గుంటూరు కార్యక్రమం చేపట్టినట్టు ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం విజయరాయిలోని గాంధీనగర్‌లో కోకో రైతు సంఘ సమావేశం నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముందు జరిగే కోకో రైతుల ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకోను రైతులు సాగుచేస్తున్నారన్నారు. కంపెనీలు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కోకో గింజలను కొంటున్నాయని ఆరోపించారు. సంఘం ఉపాధ్యక్షుడు పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి బొండాలకు గిరాకీ

- వేసవి తాపం నుంచి ఉపశమనం
- ధర పెరగడంతో రైతులకు గిట్టుబాటు



కొబ్బరి బొండాలు అమ్ముతున్న దృశ్యం

ఉంగుటూరు: ఏప్రిల్‌లోనే ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండల నుంచి ఉపశమనం కోసం సహజమైన కొబ్బరి నీరు తాగే ఎండ తీవ్రత పెరగడంతో కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది. బాటిల్ కొబ్బరి నీరు ధర రూ.120 నుంచి రూ.150 పలుకుతోంది. కొబ్బరి నీళ్లలో ఎలక్ట్రోలైట్లు అధికంగా ఉంటాయి. శక్తి నివ్వడంతో పాటు డిహైడ్రేషన్ తగ్గిస్తుంది. శరీరంలో నీటి శాతం పెంచి శక్తిని ఇస్తుంది. బొండంలో సుమారు 300 మిల్లీ గ్రాముల సోడియం ఉంటుంది. పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్నాయి. మూత్ర, కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఇది చక్కగా పనిచేస్తుంది. కొబ్బరి నీళ్లు ఒంటిలో వేడిని తగ్గిస్తాయి. అలాగే మంచి ఎనర్జీ డ్రింక్‌గా పనిచేస్తుంది.

ఎండ దెబ్బకు పెరిగిన అమ్మకాలు

ఎండలు పెరగడంతో ఉమ్మడి ఏలూరు జిల్లా నుంచి కొబరి బొండాల అమ్మకాలు బాగా పెరిగాయి. దాంతో కొబ్బరి రైతులకు గిట్టుబాటు అవుతోంది. వ్యాపారులు ఆటోలు, మిని లారీలు, లారీల మీద బొండాల తీసుకెళ్లి చిల్లర వ్యాపారులకు అమ్ముతున్నారు. అలాగే లారీల మీద ఏలూరు, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ వంటి నగరాలకు భారీగా ఎగుమతి అవుతున్నాయి. పలు చోట్ల జాతీయ రహదారి మీద చిరు వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

ఏలూరు జిల్లాలో 35,000 ఎకరాలలో కొబ్బరి తోటలు విస్తరించి ఉన్నాయి. పెదవేగి, పెదపాడు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, ద్వారకా తిరుమల, కామవరపుకోట, టీ నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల్లో కొబ్బరి తోటలు విస్తారంగా ఉన్నాయి. అక్కడనుంచి కొబ్బరి బొండాలు ఎగుమతులు సాగుతున్నాయి. కొల్లేరు పరివాహక ప్రాంతంలో చేపలు చెరువుల గట్ల మీద పెంచిన కొబ్బరి చెట్ల నుంచి బొండాలు దింపుతున్నారు.

గిరాకీ పెరగడంతో రైతులకు లాభం

కొబ్బరి బొండాలకు గిరాకీ పెరగడంతో రైతులకు గిట్టుబాటు ధర వస్తోంది. ఇటీవల కొబ్బరి బొండాలు అమ్మకాలు భారీగా పెరిగాయి. వైద్యులు కూడా బొండాలు తాగమని సూచించడంతో ఎక్కువ మంది తాగుతున్నారు. ఎకరాకు రూ.60 వేలకు తక్కువ కాకుండా ఆదాయం వస్తోంది.

–దేవదానం, హార్టీకల్చర్ ఏఓ, ఉంగుటూరు

ఆక్వా క్రాప్ హాలిడేకు సిద్ధమవ్వాలి

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతుల సమస్యల పరిష్కారమవ్వాలంటే ప్రతి ఆక్వా రైతు క్రాప్ హాలిడేకు సమాయత్తం అవ్వాలని జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు అన్నారు. యలమంచిలి మండలంలోని కట్టుకాలువ, మట్లపాలెం, చింతదిబ్బ, శిరగాలపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం రైతులతో సమావేశాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గాంధీరాజు మాట్లాడుతూ సమస్య పరిష్కారం అవ్వాలంటే నలుగురు కలిస్తేనే ఆ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. క్రాప్ హాలిడే ప్రకటించారు నా కెందుకులే అని ఏ ఒక్క రైతు అనుకున్నా ఈ సమస్య పరిష్కారం కాదన్నారు. ఆరుగాలం కష్టపడి ఆక్వా పంట పండించిన అనంతరం పట్టుబడి సమయంలో ధరలు లేక నష్టపోయేకన్నా ఓ మూడు నెలలు చెరువు ఆరబెట్టుకున్నాననుకుని క్రాప్ హాలిడేకు సమాయత్తం అయితేనే సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయగలుగుతామన్నారు. గ్రామాల వారీగా క్రాప్ హాలిడే ప్రకటించినట్లు ఆక్వా రైతులు సంసిద్ధం కావాలన్నారు. ఆక్వా సంఘం రైతులు బోణం చినబాబు, జాన్‌రాజు, బోణం రంగయ్యనాయుడు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



వెంకటరామానుజపురంలో వైఎస్సార్ విగ్రహం ఎడమ చేతిని ధ్వంసం చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట పంచాయతీ పరిధిలో వెంకటరామానుజపురం గ్రామంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఎడమ చేతిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు దీనిని గుర్తించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని సందర్శించారు. వైఎస్సార్ విగ్రహం చేతిని ధ్వంసం చేసిన వ్యక్తులను పోలీసులు గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇర్ల విజయశాంతి, ఇర్ల శ్రీనివాసరెడ్డి, దోరేపల్లి సుబ్బారావు, మర్రెడ్డి పెద రామాజంనేయులు, డి.సుబ్బారావు, జె.కమలాకరరెడ్డి, కఠారి నారాయణరావు, కఠారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు

ఏలూరు రూరల్: ఆదివారం ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలికలకు నిర్వాహకులు పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కలిగిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీను, కోశాధికారి కె.మురళీకృష్ణ వెల్లడించారు. మే 15 నుంచి 18 వరకూ చిత్తూరులో అంతర జిల్లాల అండర్–14 సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జట్టు పాల్గొంటుందన్నారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పాదయాత్ర భక్తులను ఢీకొట్టిన లారీ

ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



బిరదా అంజి (ఫైల్)





క్షతగాత్రులు దుర్గాప్రసాద్, సాయి చరణ్ తేజ

ద్వారకాతిరుమల: మొక్కుబడులు తీర్చుకునేందుకు ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి కాలినడకన వెళుతున్న ముగ్గురు యువకులను వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ముగ్గురు యువకుల్లో ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం, పుల్లలపాడులోని పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ప్రకారం.. దేవరపల్లి గ్రామానికి చెందిన దాసు దుర్గాప్రసాద్, బిరదా అంజి(20), జాజుమొగ్గల సాయిచరణ్ తేజ ద్వారకాతిరుమల క్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్నారు. మార్గ మధ్యంలో పుల్లలపాడు వద్దకు వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు వెళ్తున్న కర్నాటకకు చెందిన లారీ వీరిని వెనుక నుంచి అతి వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలై రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బిరదా అంజి మృతి చెందినట్టు అతని మేనమామ శ్రీనివాసరావు తెలిపారు. మిగిలిన ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మండుతున్న ఎండలు



తాటిముంజెలు తింటున్న ప్రజలు



పెదవేగిలో ఎండ వేడిమికి నిర్మానుష్యంగా రహదారులు

ఉదయం 11 గంటలకే రోడ్లన్నీ ఖాళీ

పెదవేగి: రోజురోజుకూ పెరుగుతున్న ఎండలకు ప్రజలు హడలిపోతున్నారు. ఉదయం 11 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వారం నుంచి ఎండల తీవ్రత పెరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 38 నుంచి 43 డిగ్రీలకు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే మే నెలను తలుచుకుని భయపడుతున్నారు. పగటిపూట ప్రయాణాలు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. రాత్రి పూట కూడా ఉక్కబోత తప్పడం లేదు.

రెక్కాడితేగానీ డొక్కాడని శ్రమ జీవులు మండుతున్న ఎండలకు విలవిల్లాడిపోతున్నారు. రోజు మొత్తం పనిచేసేందుకు వీలు లేకపోవడంతో ఉదయం పూట పనుల్లోకి వెళ్తున్నారు. వేసవిలో సహజంగా పనులు తక్కువగా ఉంటాయి. భవన నిర్మాణాలు, ఇతర పనులు చేసేవారు, వివిధ కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు ఎండ వేడిమి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. పని చేయకపోతే ఇల్లు గడవని పరిస్థితి. తప్పని పరిస్థితిలో పనులు చేయాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. భవన నిర్మాణ పనులు చేసే తాపీ మేస్త్రీలు, కూలీలు ఉదయం 8 గంటల నుంచే పనులు ప్రారంభించి త్వరగా ముగిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి బయట పనులు చేయకుండా లోపల మాత్రమే పని చేస్తున్నారు.

మంచినీటికి కటకట

ఎండల తీవ్రత పెరగడంతో పలు చోట్ల పూర్తిస్థాయిలో మంచినీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అరకొరగా నీటి సరఫరాతో అవస్థ పడుతున్నారు.

ఉదయమే పనులకు వెళ్తున్నాం

ఎండలకు భయపడి ఉదయం మాత్రమే పనులకు వెళ్తున్నాం. ఉక్కబోత తట్టుకోలేక పనులు చేయలేకపోతున్నాం. రోజంతా పనిచేస్తే రూ.300 కూలీ వస్తుంది. ప్రస్తుతం ఉదయం మాత్రమే పనిచేయడం వల్ల రూ.150 ఇస్తున్నారు. కుటుంబ పోషణకు ఆ సొమ్ము చాలడం లేదు.

బట్టు విజయరాజు, భవన నిర్మాణ కార్మికుడు, పెదపాడు

వేరుశెనగ కోత తర్వాత జాగ్రత్తలు



మెట్ట ప్రాంతంలో పండిస్తున్న వేరుశెనగ పంట

పాడి - పంట

చింతలపూడి: దేశంలో పండించే నూనె గింజల పంటల్లో వేరుశెనగ అతి ముఖ్యమైంది. వేరుశెనగ కోతలు పూర్తయ్యాక సరైన జాగ్రత్తలు పాటిస్తే విత్తనాలు రాబోయే కాలంలో పనికొస్తాయి. లేదంటే పుచ్చుపట్టి పనికి రాకుండా పోతాయి. వేరుశనగలో కోసిన పంటను తగిన తేమ (9 శాతం) వచ్చే వరకు మొక్కనుంచి కాయలను వేరు చేయడానికి ముందు ఎండ బెట్టాలి. విత్తనాలను భద్రపరుచుకుని వచ్చే పంటకు ఉపయోగించుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వేసవిలో అవలంభించాల్సిన పద్ధతుల గురించి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బి.నాగకుమార్ రైతులకు సూచించారు.

ఎండబెట్టే విధానం

వేరుశెనగ కాయలు పై భాగానికి వచ్చేటట్లు చెట్లను చిన్న, చిన్న కుప్పలుగా వేయాలి. లేదా మొక్కలను కర్రలకు కట్టి కాయలను పక్కలకు వచ్చేలా చేసి ఎండ బెట్టుకోవచ్చు.

తేమశాతం తగ్గించడం ఇలా

కాయల్లో తేమ శాతం ఎక్కువగా ఉంటే ఎండలో ఆర బెట్టకుండా తేమను 7, 8 శాతానికి తీసుకురావాలి. వేడి గాలులను వదిలే పరికరాలను ఇందుకు ఉపయోగించవచ్చు. వేరుశెనగ పంటను నిల్వ చేయడానికి ఒకసారి వాడిన సంచులను మళ్లీ వాడకూడదు. పాలిథీన్ పేపర్ ఉన్న గోనె సంచులు బాగా ఎండిన వేరుశెనగ కాయలను నిల్వ చేయడానికి ఉపయోగం.

ఎండలో ఆరబెట్టకూడదు

రబీలో పీకేటప్పుడు ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉంటుంది. కాయలను నేరుగా ఎండలో ఆరబెట్టకూడదు. నీడలో ఆరబెట్టాలి. ఎండ తీవ్రత ఉదయం 11 గంటల వరకు.. సాయంత్రం 4 గంటల తరువాత తక్కువగా ఉంటుంది. ఆయా సమయాల్లో ఆరబెట్టుకోవాలి. ఎండబెట్టే సమయంలో వేరే రకాల కాయలు కలవకుండా చూసుకోవాలి.

నిల్వ చేసుకునే విధానం

విత్తనం కోసం బాగా ముదిరిన కాయలను నిల్వ చేసుకోవాలి. కాయలను కదిలిస్తే ఘల్లుమని శబ్దం రావాలి. అప్పుడే బాగా ఎండినట్లు అర్థం. కాయలను నిల్వ చేసుకోవడానికి శుభ్రమైన పాలిథిన్ లైనింగ్ ఉన్న గోనె సంచులను వాడాలి. గోనె సంచులను 0.5 శాతం మలాథియాన్ ద్రావణంలో ముంచి బాగా ఆరబెట్టుకోవాలి. దీని వల్ల కాయల్లోని గింజలకు శిలీంధ్రాల బెడద ఉండదు.



బి నాగకుమార్ -సహాయ వ్యవసాయ సంచాలకులు

అలరించిన నాటికలు



యలమంచిలి మండలం కొంతేరులో ప్రదర్శించిన అనూహ్యం నాటికలోని దృశ్యం

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీ పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిర్ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న నాటిక పోటీలలో చివరి రోజు ఆదివారం రెండు నాటికలు ప్రదర్శించారు. మానవ జీవితంలో ఎన్ని సంబంధాలు ఉన్నా.. పేగుబంధం చాలా గొప్పదని శ్రీ సౌజన్య కళా స్రవంతి ఉత్తరాంధ్ర వారు ప్రదర్శించిన దేవరాగం నాటికలో చూపించారు. కడుపున పుట్టిన బిడ్డలను తల్లిదండ్రులు గుండెల మీద పెట్టుకుని పెంచితే.. ఆ తల్లిదండ్రులకు వృద్ధాప్యం వచ్చిన తరువాత పిల్లలు గుండెల మీద తన్నితే ఏ విధంగా తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపంగా మారుతుందో కళ్లకు కట్టినట్లు రచయిత, దర్శకుడు కెకెఎల్ స్వామి చూపించారు. ఆనందరామయ్య, వసుంధర దంపతుల కుమారులు మనోహర్, రాజేష్ సోమరిపోతుల్లా మారి మోసకారైన ధనుష్కోటితో కలసి తల్లిదండ్రులను మోసం చేసి ఆస్తి కాజేయాలని చూస్తారు. వారి మోసాన్ని పసిగట్టిన ఆనందరామయ్య పిల్లలకు ఏ విధంగా బుద్ధి చెప్పాడు. కొడుకులు వారసత్వ సంపదను అనుభవించడం కోసం బిచ్చగాళ్ళలా ఎదురు చూడకుండా, స్వయంకృషితో ఆత్మాభిమానంతో ఎలా జీవించాలని నాటికలో సందేశమిచ్చారు. ఈ నాటికను తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించగా కత్తుల రామమోహనరావు దర్శకత్వం వహించారు. నాటిక పోటీల నిర్వహణకు యూత్ క్లబ్ నాటక పరిషత్ కార్యవర్గం అంబటి మురళీకృష్ణ, గంటా ముత్యాలరావు, బోణం రవిబాబు, జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం, అంబటి నవీన్‌చంద్, బోడపాటి రాజశేకర్, సుదర్శనం శ్రీనివాస్, జవ్వాది శ్రీనివాసులనాయుడు, గోడి మోహనరావులతోపాటు కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు సహకరించారు.

3,240 కేజీల సారా బెల్లం స్వాధీనం

చింతలపూడి: ఏలూరు ఈఎస్‌టిఎఫ్ అధికారులు, చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు సంయుక్తంగా కంచనగూడెం గ్రామంలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో శాకా చిన పుల్లారావు నుంచి 10 లీటర్ల సారా, 500 గ్రాముల ఈస్ట్ స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ పి.అశోక్ ఆదివారం తెలిపారు. బెల్లం సరఫరా చేసిన కుమార్ ట్రేడర్స్ దుకాణంపై దాడి చేయగా 3,240 కేజీల బెల్లం, 8 కేజీల ఈస్ట్, 5 కేజీల ఆలంను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి మెజిస్ట్రేటు ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



నులకాని పూర్ణ సాయి పవన్ (ఫైల్)

టి.నరసాపురం: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిరుపతిపాడులో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం..తిరుపతిపాడుకు చెందిన నులకాని పూర్ణసాయి పవన్(22) ట్రాక్టర్ డ్రైవింగ్ చేసేవాడు. తల్లిదండ్రులు ట్రాక్టర్ డ్రైవింగ్ వద్దు, పొలంలో వ్యవసాయాన్ని చేసుకుందామని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన పూర్ణసాయి చీరతో ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు.

కళారంగానికి చేయూతనిస్తాం



చైతన్యభారతి నాటిక పోటీల ముగింపు సందర్భంగా డాక్టర్ కృష్ణంరాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు పుంజుకున్న తరువాత కళారంగానికి చేయూతనిస్తామని సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న చైతన్య భారతి సంగీత, నృత్య నాటక పరిషత్ 18వ జాతీయస్థాయి నాటికల పోటీల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. నాటకాలపై ప్రేక్షకుల ఆదరణ తగ్గలేదని ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాను రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేయడానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. కళా పరిషత్‌ల ద్వారా నాటకరంగం నిరంతరం కొనసాగడానికి పరిషత్ నిర్వహణ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడానికి సమావేశం నిర్వహణకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం చవాకుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటుడు బాలాజీ నాయక్‌కు మైనంపాటి రంగనాయకులు రంగస్థల చైతన్య పురస్కారంతో సత్కరించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పెన్మెత్స కృష్ణంరాజును ఆత్మీయ చైతన్య పురస్కారంతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులపర్తి అంజిబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పాలకోడేరు: గోస్తని నది మధ్యలో ఒక మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని.. బ్లూ రంగు జీన్ ప్యాంట్, పొడుగు చేతుల ఎరుపు ముదురు ఆకుపచ్చ నలుపు డిజైన్ కలిగిన షర్ట్ ధరించినట్లు పోలీసులు చెప్పారు. ఛాతిపై ఎడమవైపు నాగు, కుడి వైపు నాగమణి పేర్లు ఉన్నాయని.. సుమారు ఐదు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని చెప్పారు. విస్సాకోడేరు వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై ఎం.రవివర్మ తెలిపారు.

తేనెటీగల దాడిలో నలుగురికి గాయాలు

ఆకివీడు: స్థానిక అజ్జమూరు రోడ్డులో నలుగురిపై తేనెటీగలు ఆదివారం దాడి చేసి గాయపర్చాయి. అజ్జమూరు రోడ్డులో రైస్‌మిల్లు ఎదురుగా ఉన్న చింత చెట్టుపై తేనె పట్టు నుంచి ఒక్కసారిగా తేనెటీగలు వాడపల్లి రాంబాబుపై దాడి చేశాయి. అతన్ని రక్షించేందుకు మరో ముగ్గురు ఆ ప్రాంతానికి వెళ్లి దుప్పట్లతో తేనెటీగలను చెల్లాచెదురు చేస్తుండగా వారిని కూడా గాయపర్చాయి. అక్కడి నుంచి వారు పరుగులు తీసి రైస్ మిల్లులోకి పారిపోయారు. గాయపడ్డ రాంబాబుతో సహా మరో ముగ్గురిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం కేపీ పాలెం సౌత్ సాయిబాబా ఆలయం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కేపీ పాలెం సౌత్ గ్రామంలోని సాయిబాబా ఆలయం సమీపంలో శనివారం అర్ధరాత్రి బైక్‌పై వెళుతున్న వీరవాసరం గ్రామానికి చెందిన మల్లుల నాని(20), అతని మిత్రుడు హేమంత్ సాయి తాటిచెట్టును ఢీకొట్టారు. నాని ఘటనా స్థలంలోనే మృతి చెందగా హేమంత్‌సాయికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

తణుకు అర్బన్: మండలంలోని మండపాక గ్రామంలో యర్నగూడేనికి చెందిన కల్యాణ వేంకటేశ్వర స్వామి భజన మండలి ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కావలిపురపు బాలకృష్ణ, సౌజన్య దంపతులచే నిర్వహించబడిన ఈ కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ కల్యాణ వేడుకలో భజన మండలి అధ్యక్షుడు గద్దె నాగమణి, బొల్లిన పద్మ, బొల్లిన రోజా, పిన్నమనేని రత్నం, గద్దె లతలను సన్మానించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఏడాది కాలంగా భజన మండలి ఆధ్వర్యంలో 34 ప్రాంతాల్లో స్వామి వారి కల్యాణాలను నిర్వహించినట్లు అధ్యక్షురాలు నాగమణి తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేధింపుల కేసు నమోదు

పెంటపాడు: ప్రత్తిపాడుకు చెందిన దివ్యాంగురాలైన వివాహితను నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడన్న ఆరోపణపై బాధితురాలు పెంటపాడు పోలీసులకు ఆదివారం ఫిర్యాదుచేసింది. ఈమేరకు అదే ప్రాంతానికి చెందిన సునీల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు.

గుండె వ్యాధుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణంరాజు

భీమవరం: గుండె వ్యాధుల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి వ్యాయామం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం వలన గుండె ఆరోగ్యంగా ఉంటుందని హైదరాబాద్ కేర్ హాస్పిటల్ ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పెన్మెత్స కృష్ణంరాజు అన్నారు. భీమవరం చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనంద పంక్షన్ హాల్‌లో ఆదివారం గుండె చప్పుడు–గుండె జబ్బుల నివారణపై ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణంరాజు మాట్లాడుతూ చిన్న పిల్లలతో సహా అన్ని వయసుల వారు ఎక్కువగా గుండె సంబంధిత రోగాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు.

చర్చి స్థలంలో మున్సిపల్ ఆఫీసు సరికాదు

ఆకివీడు: క్రైస్తవ మైనార్టీకి చెందిన చర్చి స్థలంలో మున్సిపల్ కార్యాలయం నిర్మించాలని అజెండాలో పొందుపరచడం సరికాదని ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ టౌన్ కార్యదర్శి గూడపాటి జోసఫ్ అన్నారు. ఈ నెల 30వ తేదీన మున్సిపల్ సమావేశంలో అజెండాకు చర్చించనున్న సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక అయిభీమవరం రోడ్డులోని సర్వే నంబర్ 473లో 2.80 సెంట్లు భూమిని 1891లో క్రేక్ దొర కొనుగోలు చేసి, స్థానిక సంఘానికి అప్పగించారన్నారు. అప్పట్లోనే రిజిస్ట్రేషన్ చేయించారని, ఈ భూమికి సంబంధించిన అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని జోసఫ్ రాజు చెప్పారు. దీనిపై నగర పంచాయతీ ముందుకు వెళ్లకుండా క్రైస్తవ సంఘానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వాడవాడలా కార్మిక శక్తి చాటాలి

భీమవరం: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని వాడవాడలా ఎర్రజెండాలు ఆవిష్కరించి, కార్మిక శక్తిని చాటాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. మేడే వేడుకల సన్నాహాల్లో భాగంగా శనివారం భీమవరం కామాక్షమ్మ దేవాలయంలో మున్సిపల్ వర్కర్స్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిలారి మల్లేశ్వరరావు మాట్లాడుతూ మేడే రోజున ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్మికుల అపరిష్కృత డిమాండ్ల సాధనకు మే 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు.

వేంకటేశ్వరునికి ద్వాదశ ఆరాధన

భీమవరం (ప్రకాశంచౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ద్వాదశ ఆరాధన పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో కేవీఎస్ భాస్కరరావు, సీతా నాగేశ్వర దంపతులచే అర్చకులు శ్రీనివాసాచార్యులు శ్రీవారికి పలురకాల పుష్పాలతో పూజలుచేశారు. సోమవారం ఉదయం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆహా ఏమి రుచి.. పండూరు మామిడి

- తణుకు మార్కెట్‌ను ముంచెత్తిన వైనం
- కొనుగోళ్లకు పోటీపడుతున్న జనం
- తూర్పుగోదావరి నుంచి తణుకు మార్కెట్‌కు



హోల్‌సేల్ మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పండూరు మామిడి పళ్లు

తణుకు అర్బన్: మామిడి పండ్లలో అత్యధికంగా అమ్ముడుపోయేది పండూరు మామిడి కాయలు తణుకు పండ్ల హోల్‌సేల్ మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. మామిడి జాతి రకాల్లో కాయ చిన్నగా ఉన్నా మధురమైన రుచినివ్వడంలో మొదటి స్థానంలో మంచి పేరుగాంచింది. వేసవి వస్తుందంటే చాలు పండూరు మామిడి కాయల కోసం ఆ జాతి కాయ రుచి తెలిసిన మామిడి ప్రియులు ఎదురుచూపులు చూస్తుంటారు. వీటి విక్రయాలు వ్యాపారులకు ఫోన్లపైనే బుకింగ్‌లు అయిపోతాయంటే పండూరు మామిడికి ఎంత క్రేజ్ ఉందో తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి, తుని, కత్తిపూడి, అన్నవరం తదితర ప్రాంతాల్లో విరివిగా కాచే ఈ పండూరు మామిడి నిత్యం తణుకు పండ్ల హోల్‌సేల్ మార్కెట్‌కు తరలి వస్తున్నాయి.

దేశ విదేశాలకు తణుకు నుంచి ఎగుమతి

తణుకు పండ్ల హోల్‌సేల్ దుకాణాల నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాలకు సైతం ఈ కాయలు రవాణా జరుగుతుంటాయి. తణుకు మార్కెట్‌కు 20 టన్నులకుపైగా ఈ మామిడికాయలు వస్తున్నాయి. కాయ సైజును బట్టి రూ. 20 నుంచి రూ. 35 వరకు అమ్మకాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఉన్నత స్థాయి అధికారులకు కింది స్థాయి ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు ఈ మామిడి కాయలను ప్రతి సీజన్‌లోను ప్యాకింగ్ రూపంలో బస్సులు, రైళ్లు, విమానాల్లో సైతం రవాణా జరుగుతుంటాయి. ఈ ఏడాది మామిడి కాపు అధికంగానే ఉండడంతో మార్కెట్‌లో పండూరు మామిడి ధరలు కూడా వీలుగానే ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

రుచిలో నంబరు వన్



మామిడి జాతుల్లో పండూరు మామిడి నంబరు వన్‌లో నిలుస్తుంది. దూర ప్రాంతాలకు ఈ మామిడికాయలను ముఖ్యమైన వారికోసం వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారు. వేసవి వస్తుందంటే చాలు పండూరు మామిడి కాయలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూసే పరిస్థితి ఈ జాతికి ఉంది. తింటే పండూరు మామిడే తినాలనే వారు లేకపోలేదు. ఇతర దేశాలకు సైతం ఈ మామిడి కాయలను రవాణా చేస్తుంటారు.

– బసవ సరిపండు, పండ్ల వ్యాపారి, తణుకు

సభ్యుల అభ్యున్నతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్

తణుకు అర్బన్: లేత్ అండ్ ఆర్క్ వెల్డింగ్, డిజైన్ వర్క్ ఓనర్స్ అసోసియేషన్ 14వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం స్థానిక కొండాలమ్మ తల్లి ఆలయ ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కనిత శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యుల అభ్యున్నతే లక్ష్యంగా సంఘం పని చేస్తుందన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో సభ్యులకు బీమాలు, ముద్ర లోన్‌ల మంజూరు చేయడంలో కీలకంగా పని చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండూరి సురేష్, కుడుపూడి చంద్రరావు, బళ్ల నాని, కోశాధికారి ఎ.త్రిమూర్తులు, కె.కృష్ణ, పిట్టా శివ, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామ వ్యాఖ్యలకు నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రావుపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకోవాలని సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం తణుకు మండలం వేల్పూరులో సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రం మాట్లాడుతూ భూస్వాములకు కొమ్ము కాస్తూ పేదల ఇళ్లను అన్యాయంగా కూల్చి వేయడం దారుణమన్నారు. దీనికి కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణం సమాధానం చెప్పాలని, కూల్చి వేసిన ఇళ్ల బాధితులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరావు. యండమూరి నాగేంద్ర. వాసా పోసియ్య. లంకె నారాయణ. తాళ్ళ సత్యనారాయణ. అందే కోట బసవయ్య. లంకె దుర్గారావు పాల్గొన్నారు.

ఉగ్రవాద చర్యలను రూపు మాపాలి



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ వ్యాప్తంగా ఉగ్రవాద చర్యలను రూపు మాపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జమ్ము కాశ్మీర్ మృతులకు సంతాపం తెలియజేస్తూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ పెహల్గావ్ వద్ద ఉగ్రవాదులు చేసిన దాడిలో 28 మంది పర్యాటకులు మృతి చెందగా 12 మంది తీవ్రంగా గాయపడిన దారుణ సంఘటనపై సీపీఎం ఖండిస్తున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జట్టు కార్మికుల నిరసన

పెంటపాడు: ప్రత్తిపాడు గాంధీరెడ్డి గోడౌన్ వద్ద జట్టుకార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం తీవ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన చిర్ల పుల్లారెడ్డి, శిరపరపు రంగారావు మాట్లాడుతూ పెహల్గావ్‌లో పాకిస్తాన్ తీవ్రవాదులు అమాయకులను పొట్టన పెట్టుకోవడం హేయమైన చర్య అన్నారు. పెనగంటి దుర్గ, వడ్డాది సన్యాసిరావు, జక్కంపూడి బంగార్రాజు, పెంటారావు, గెళ్ల పాపారావు, కొమ్మూరి గోపి, మజ్జి సురేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మేడేను పని హక్కు దినోత్సవంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భీమారావు

తణుకు అర్బన్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను కార్మికులు 8 గంటల పని హక్కు పరిరక్షణ దినోత్సవంగా ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ అక్కమాంబ టెక్స్ టైల్స్ ఉపాధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఆదివారం తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ కమిటీ సమావేశానికి భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. మేడే సందర్భంగా కార్మిక సంఘాలు అరుణ పతాకాలు ఆవిష్కరించి, ర్యాలీలు, సభలు నిర్వహించాలన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ల రద్దు కోరుతూ మే 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతానికి మేడే సభల్లో కార్మికులను చైతన్యం చేయాలన్నారు. యూనియన్ కార్యదర్శి అనంత త్రివిక్రమరావు, ఉపాధ్యక్షులు దేవ పెద్దిరాజు, కనకారావు కోశాధికారి ఎ.గోపాలకృష్ణ, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో చండీ హోమం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు చండీ హోమం నిర్వహించారు. 52 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి తెలిపారు. అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముమ్మరంగా దాళ్వా మాసూళ్లు



వరికోత యంత్రం ద్వారా పంటను నూర్పిడి కోయిస్తున్న రైతులు



ఆరబెట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతు

అత్తిలి: తణుకు నియోజకవర్గంలో దాళ్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో 42 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. ఇప్పటి వరకు 35 శాతం వరకు మాసూళ్లు పూర్తయ్యాయి. 80 శాతం మేర ఎంటీయూ 1121 రకం, 20 శాతం పీఆర్–126 రకాలను సాగు చేశారు. వరికోత యంత్రాలు భారీగా రావడంతో వరికోతలు జోరందుకున్నాయి. దాళ్వా పంట దిగుబడి ఆశాజనకంగా రావడంతో రైతులకు ఊరటనిచ్చింది. ఎకరాకు 50 బస్తాలు పైబడి దిగుబడి వస్తోంది. రైతులు తమ పంటను సమీప రైతుసేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. అత్తిలి మండలంలో 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యం నిర్ధారించగా ఇప్పటి వరకు 7 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. మండలంలో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో మాసూళ్ల పనులలో రైతాంగం నిమగ్నమైంది. వాతావరణం అనుకూలిస్తే మే 10వ తేదీ లోపు వరికోతలు పూర్తయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

క్రాప్ హాలిడేతో ఉపాధి గండం

భీమవరం: రొయ్యల రైతుల అవస్థలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పటికే కొంతమంది రైతులు ఆక్వా క్రాప్‌హాలీడే ప్రకటించారు. దీంతో ఆక్వా రంగంపై ఆధారపడిన అనేక మందికి ఉపాధి కరువైంది. మరికొంతమంది రైతులు స్థానిక మార్కెట్‌ను పెంచుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా భీమవరం పట్టణానికి చెందిన ఆక్వా రైతు, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదిరాజు వెంకట సుబ్బరాజు ఆదివారం భీమవరం రైతు బజార్‌లో శుభ్రం చేసిన రొయ్యల అమ్మకం ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా పూర్తిగా శుభ్రం చేసిన రొయ్యలను రూ.100 నుంచి పలు ధరల్లో లభించే విధంగా ప్యాకింగ్ చేసి విక్రయాలు చేపట్టారు. మన ప్రాంతంలో పండించే రొయ్యలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. స్థానికంగా వినియోగం అంతంత మాత్రమే. దీంతో కరోనా సమయంలోనూ, అమెరికా సుంకాల పెంపుతో రొయ్యల ధర గణనీయంగా తగ్గిపోయింది. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఆక్వా సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

గత ప్రభుత్వంలో పటిష్ట చర్యలు

అయితే కరోనా సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రొయ్యల ధరలు నిలకడగా ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో అప్పట్లో రైతులు ఊరట చెందారు. అయితే ఇటీవల అమెరికా పన్నుల కారణంగా అన్ని కౌంట్ రొయ్యల ధరలు భారీగా పతనమయ్యాయి. రొయ్యల సాగులో ఉపయోగించే సీడ్, ఫీడ్ ధరలు పెరగడంతో ఆక్వా సాగు రైతులకు గిట్టుబాటు కాక ఇప్పటికే అనేక మంది రైతులు క్రాప్‌హాలీడే ప్రకటించారు. అయినప్పటికీ ప్రభుత్వ పరంగా పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తుండగా లక్షలాది మంది రైతులు, కార్మికులు, ఇతర వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇటువంటి తరుణంలో క్రాప్ హాలీడే ప్రకటించడం వలన వీరంతా ఉపాధి కరువై రోడ్డున పడే అవకాశముంది.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు



తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారులు



తణుకు అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారిణి సుగుణకుమారి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ సోమ వారం నుంచి జూన్ 6 శుక్రవారం వరకు 40 రోజులపాటు సమ్మర్ క్లాసులు (వేసవి శిక్షణ శిబిరాలు) నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధి కారి పి.శ్రీనివాసరావు వెల్లడించారు. వేసవి శిక్షణలో ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ శిబిరాలు ఉంటాయని తెలిపారు. కథలు, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, యోగా, క్రీడలు పలు అంశాలపై చిన్నారులకు రీసోర్స్‌పర్సన్‌లు శిక్షణ అందిస్తారని చెప్పారు. రిసోర్స్‌పర్సన్లుగా అనుభవజ్ఞులు జి.బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, వి.జనర్ధనరావు, ఆర్.నాగేంద్రకుమా ర్, సీహెచ్ శ్రీదేవి, కె.వెంకటేశ్వరరావు హాజరవుతారని, విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

తణుకు అర్బన్: గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి కాటూరి సుగుణ కుమారి కోరారు. గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు తణుకు రాజీవ్ గాంధీ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, రీసోర్స్ పర్సన్లు ఈ శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరం అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి, కార్యదర్శి కౌరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెంటపాడు: పెంటపాడు పోస్టు బేసిక్ స్కూలు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. 20 ఏళ్ల అనంతరం తొలిసారిగా కలుసుకున్న వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా కుటుంబాలతో గడిపారు. ఆనాటి గురువును సన్మానించుకొని, ప్రతి ఏటా కలుద్దామని, సేవా కార్యక్రమాలు చేయాలని తలంచారు.

చెరువులకు జలకళ



మేడపాడులో నీటితో నిండు కుండలా ఉన్న మంచినీటి చెరువు

యలమంచిలి: వేసవిలో ప్రజలకు తాగునీటికి ఎద్దడి రాకుండా ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో మండలంలోని మంచినీటి చెరువులన్నీ పూర్తిగా నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలో మొత్తం 32 గ్రామాలుండగా 16 గ్రామాల్లో మంచినీటి చెరువులు, 16 గ్రామాల్లో బోరుల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుంది. ఈ నెల 25న కాలువలు మూసివేశారు. ఈ నేపథ్యంలో వేసవిలో ప్రజలకు, పశువులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి చెరువులను, పశువుల చెరువులను పూర్తి స్థాయిలో నింపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వెంకటరమణ తెలిపారు. మూడు శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఆయిల్ ఇంజన్లు పెట్టి నీరు తోడి చెరువులను పూర్తి స్థాయిలో నింపారు. పెనుమత్రు, కట్టుపాలెం, నేరేడుమిల్లి, శిరగాలపల్లి, మేడపాడు, అడవిపాలెం, కొంతేరు, కాజ పడమర, కాజ తూర్పు, ఊటాడ, కలగంపూడి, ఆర్యపేట, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లో చెరువలన్నీ పూర్తి స్థాయిలో నిండాయి. మరొక నెల రోజుల వరకు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం ఉండని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వెంకటరమణ తెలిపారు. చిన్న చెరువులున్న గ్రామాల్లో చెరువులో నీరు నిండుకుంటే ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేసేందుకు సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చినట్లు ఆయన చెప్పారు.



నేరేడుమిల్లిలో పూర్తిగా నీటితో నిండిన మంచినీటి చెరువు



కలగంపూడిలో కళకళలాడుతున్న చెరువు

ఆకట్టుకున్న అష్టావధానం



సమావేశంలో పాల్గొన్న కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం నెలవారీ సభా కార్యక్రమంలో భాగంగా స్థానిక గీతా మందిరంలో తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం పరిశోధక విద్యార్థి యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు అష్టావధానం నిర్వహించారు. ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. పురాణ, ధారణ విషయాల్లో అవధాని అత్యంత వేగంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ అధ్యక్షత వహించారు. నెలవారీ కార్యక్రమంలో భాగంగా మదర్ వన్నిని ఆసుపత్రి ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ వల్లభనేని దుర్గా శ్రీనివాస్ చౌదరికి గౌరవ సత్కారం, కాకినాడకు చెందిన గాయకుడు తిరుక్కోవల్లూరి వెంకట రమన్‌కు కళా సత్కారం, పాలకోడేరు ఉన్నత పాఠశాల తెలుగు పండితులు తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తిని ఉత్తమ ఉద్యోగ సేవ పురస్కారం లభించింది. తెన్నేటి నరసింహమూర్తి రచించిన బోధామృత శ్రీకృష్ణ గీత పుస్తకాన్ని ఆర్‌వీఎస్ రాజు ఆవిష్కరించారు. కలిసిపూడి మృత్యుంజయరావు, జేకే కృష్ణ, ఏలూరి జగదీష్, మాస బాబూరావు, సాయిచిరు నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

వరి కోత యంత్రం అడ్డగింతపై ఫిర్యాదు



రైతుతో మాట్లాడుతున్న ఆర్ఐ ఆంజనేయులు

ఆకివీడు: రైతువారీ పనులకు ఆటంకం కలిగిస్తే సెక్షన్ 251 ప్రకారం చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని దుంపగడప గ్రామంలో మూలలంక, దుబ్బుకోడు ఆయకట్టులోని రైతు కడియం ప్రసాద్ వరి కోత యంత్రం పొలంలోకి వెళ్లడంతో అడ్డుకున్న సంఘటనపై ఆ ప్రాంత రైతులు తహసీల్దార్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతోనూ, వరి కోత యంత్రం అడ్డుకున్న రైతు ప్రసాద్‌తో సంప్రదింపులు చేశారు. దీంతో రైతు తన పొలం గట్టు నుంచి వరి కోత మిషన్‌ను ఇతర రైతుల పొలంలోకి వెళ్లేందుకు మార్గం కల్పించారు.